హృదయ సౌందర్యం

శ్రీమతి చుండూరి రమాదేవి

అది భయంకర కాళరాత్రి. విధివిరామంలేకుండా, ఏనుగు తొండాల్లాంటి ధారల్తో, వర్షం కురుస్తోంది. అల్లాంటి భీభత్ససమయంలో అన్నపూర్ణమ్మగారు యమబాధ పడిపోతోంది. ఆమె శల్యమాత్రావశిష్టయై, జీవిత సమాప్తి గంటల మీదున్నట్లుంది. ఆమెప్రక్కన సుమారు యిరవై సంవత్సరాల యువతి కూర్చుండి, మాటిమాటికి ఆ వృద్ధురాలిదెస దృష్టుల బరపుతోంది.

'ప్రభా! అబ్బాయి రాలేదూ?'

'అత్తయ్యా, ఇంకా రాలేదు.'

'అమ్మాయీ! నేనింక బ్రతకనే, అంతిమక్షణంలో వీడొక్కసారి నా కళ్ళబడితే బాగుండును. నా కీరాత్రి గడవదు. రా తల్లీ! ఇల్లారా, నాదగ్గిరకూచో. నీ విషయంలో వీడు చాలా అన్యాయం చేస్తున్నాడు. కానీ అమ్మా, నీకివి చీకటి రోజులు. ఇంక వెన్నెలరోజులు రాకపోవులే. నీకు శుభం ఆసన్నమైంది. నామాట నమ్మతల్లీ?'

'అత్తయ్యా! ఇవన్నీ యెందుకు? ఏం భయంలేదు. ఈరాత్రి కొంచెం యెక్కువచేసింది. తెల్లారేటప్పటికి తగ్గిపోతుంది.'

'అయ్యో, పిచ్చితల్లీ! నీకు తెలియదమ్మా, తెల్లారేటప్పటికి, తనువే తెల్లారిపోతుంది. ఇంక కాసేపో కాసేపో! అబ్బా, ఆయాసం. నీవు అమాయకురాలవు. ఎల్లా దిద్దుకుంటావో యీ సంసారం! వాడు పట్టి దౌర్భాగ్యుడు కాకపోతే మాణిక్య మంటిపిల్లను యీ విధంగా పుసురుపెడతాడా? కట్టి కుడుపకపోదులే అమ్మా.'

'పోనీండి అత్తయ్యా, అల్లా అనకండి. వారినేమైనా అంటే, నా హృదయానికి నొప్పి కలుగుతుంది. అది నా అదృష్టం. వారేంచేస్తారు? ఏ విధానా వారికి తగను. ఆ సుందర ముఖసందర్శనం అనుదినమూ కలుగుతూంటే నాకదే చాలు.

'ప్రభా, రూపం కోరుతున్నాడుగాని, గుణం తెలుసుకోటంలేదు. యింత కష్టపెడుతున్నా నీకు వాడంటే యెంతప్రేమ! బూటు చప్పుడౌతోంది. చూడమ్మా వచ్చాడేమో? అబ్బా! ఆయాసం. ఉక్కిరిబిక్కిరౌతోంది.

(చూచి) 'రాలేదు అత్తయ్యా. తల్లికన్న మిన్నగా చూచు మిమ్మల్నికూడా పోగొట్టుకొని ఎల్లా బతకను? ఈ సంసారభారం నేను మోయలేను. నేనుకూడా మీవెంట వస్తా. నన్నింక ఆదరించేవారెవరు?'

'తప్పు తల్లీ. వూరుకో. ఏడవకూడదు. ఇంకా ఎన్నాళ్లు బతకను? మనోవ్యాధికి మందులేదు. వాణ్ణి ఆఖరిసారి చూట్టానికి నాప్రాణం కొట్టుకొంటూంది. ఏంలాభం? వాడురాడు. మాతృహృదయం

తెలుసుకోలేని మూర్ఖుడు. అమ్మా, యీ సమయంలో కొడుకైనా నువ్వే, కోడలవైనా నువ్వే. నాకు ఆయాసం యెక్కువైపోతోంది. ఆ తులసితీర్థం గొంతుకలో పొయ్యి. అబ్బాయీ... నారాయణ... నారాయణ.

మోహనుడు శ్రీమంతుడు, సుందరుడు. అన్నపూర్ణమ్మ శివరామయ్యగార్ల ఏకైక పుత్రుడు. నూతన విలాస ప్రియుడు. నిత్యసంతోషి. పాశ్చాత్యనాగరికతానుసరణ అతనికి పరిపాటి. తన సహభాగినికూడ తన వలెనే నాగరికతావలంబియై తనకు ముదము గూర్పవలెనని కోరువాడు. ప్రభావతి పల్లెటూరి పిల్ల. కల్ల కపటము లెరుగని అమాయకురాలు. సుగుణవతి. అత్తమామల ప్రాణము. భర్త హృదయమెరింగి మసలుకొను మగువ. సంస్కృతాంధ్రములలో చక్కని కృషి చేసినది. బంగారుబొమ్మ. మోహనునకు వివాహము బాల్యంలోనే జరిగింది. అతని తండ్రి శివరామయ్యగారు వ్యాధిగ్రస్తుడై యుండగా తన గారాబు పుత్రుని వివాహమైనా చూడదలచి కామదీక్షితులగారితో సంబంధము కలుపుకొన్నారు. అప్పటికి మోహనునికి 14 ఏండ్ల వయస్సు. ప్రభావతికి 8 సంవత్సరాలు. వివాహమైన ఆరుమాసాలకే శివరామయ్యగారు గతించారు. అన్నపూర్ణమ్మ గారు పుత్రుని చూచుకొనుచూ కొంత పతివియోగం మరువగలిగింది.

ఇంకో సంవత్సరానికి, ప్రభావతి మశూచికం పడింది; బతకదనుకొన్నారు. అన్నపూర్ణమ్మగారు కోడలు కులాసాగా బయటపడాలని వెయ్యిదేవుళ్ళకి మ్రొక్కింది. పీల్చి పిప్పినిచేసి అమ్మవారు బయట పడేసింది. కాని, రూపు మారిపోయింది. వామ నేత్రంలో పువ్వేసింది. మొహంనిండా గాట్లు. పూర్వపు ప్రభావతికీ, యీ ప్రభావతికీ పోలికలేదు. దైవనిర్ణయం. ఎవరేంచేస్తారు?

మోహనుడు పండక్కి అత్తవారింటికి వెళ్లాడు. భార్యను చూచి నిర్ఘాంతపోయాడు. నిరాశ చెందాడు. తాను నిర్మించుకొన్న వూహాసౌధాలు నేలకూలినవని తలచినాడు. తన భార్య తనకేవిధమున సరిరాదని నిశ్చయించింది అతని మనసు. ఆమెయందు విముఖత జనించింది. మరి అత్తవారిగుమ్మం తొక్కలేదు.

ప్రభ వ్యక్తురాలై 2 సంవత్సరాలైంది. మోహనుని అవస్థ పూర్తిగా మారిపోయింది. నిరంతర మిత్ర పరివృతుడు. అభ్యాసాలన్నీ పట్టుపడ్డాయి. స్నేహితులు చెప్పింది ప్రమాణం. రూపాయలు దమ్మిడీలగా వెచ్చించడ మారంభించాడు. సూటు, బూటు, హ్యాటు; దొరగారివలె తయారయ్యాడు. ప్రపంచజ్ఞానము నశించిపోయింది. చదువుకి స్వస్తి చెప్పాడు. స్వయంరాజా స్వయంమంత్రీ. అతనికేమిలోటు? వృద్ధమాత మాట పెడచెవిని పెట్టినాడు. ఆ మాతృహృదయం క్షోభిల్లిపోయింది. తన గారాబమే తనకు ముప్పైంది. కోడల్ని తీసుకువస్తే కొంత నడవడి బాగుపడుతుందని తోచింది. వియ్యాలవారింటికి వెళ్లి పిల్లను కడుపులో పెట్టుకు కాపాడతానని తీసుకొచ్చింది.

మోహనుని ప్రవృత్తిమాత్రం ఏమాత్రం మారలేదు. పైపెచ్చు యింటికికూడా రావడం మానే శాడు. దాంతో అన్నపూర్ణమ్మగారికి మనోవ్యాధి అంకురించింది. ఒకనాడు మోహనుడు, భోజనానికి కూర్చున్నాడు. అన్నపూర్ణమ్మగారు వడ్డిస్తున్నది.

'నాయనా! రెండురోజులనుండి ఎక్కడున్నావురా?

'నీ కెందుకు? ఎక్కడో అక్కడ వున్నాను. యింటికొచ్చి చేసేదేముంది?'

‘అదేమిరా అల్లాఅంటావు? నీవు కళ్ళకైనా కనబడితే చాలునని చూస్తోందిరా ప్రభ. భగవంతుడు చేసిన లోపానికి అదేం చేస్తుందిరా? అది మహాయిల్లాలు. దాన్నేడిపించకూడదు.

‘నేనూ ఆలోచిస్తూనే వున్నాను. కాని నా మనస్సేమాత్రం ఆవైపు పోవటంలేదు. నేనేంచెయ్యను?

‘నాకు శరీరంలో వ్యాధి ప్రవేశించింది. నేను చాకిరీచెయ్యలేకుండా వున్నాను. అది పెడితే తినవాయె. తువ్వాలందిస్తే దూరంగా గిరవాటేస్తావు. మాట్లాడబోతే కస్సుమంటావు. అది లోలోపల కుమిలిపోతోంది. గుణవంతురాలు. అటువంటిది నీకు సప్త జన్మాలెత్తినా దొరకదు.’

‘అమ్మా ఇంక చాలించు. ఆ విషయం నాదగ్గిర తేబోకు. ఇలాగయితే నేను యింటికిరాను.’

ఈ విధంగా అన్నపూర్ణమ్మగారు కొడుకును మందలిస్తూవుండేది. కాని మోహనునకు చెవిటివాడి ముందర శంఖూదినట్లు అయ్యేది.

గుణవతియైన కోడలు దుఃఖం చూడలేక అన్నపూర్ణమ్మగారు చాలా బాధపడేది. చివరకు ఆ మనోవ్యాధితోనే మరణించింది. ప్రభావతి అత్తగారు పోయినప్పటినుండి మరింత బెంగెట్టుకుపోయింది. భర్త అనుగ్రహానికి పాత్రురాలను చెయ్యమని భగవంతుని ప్రార్థిస్తూ ఏకాకిలా ఆయింట్లో వుండేది. మోహనుడు వచ్చినరోజు వచ్చేవాడు, లేనిరోజులేదు. వచ్చినప్పుడైనా నాలుగు మెతుకులు తిని చక్కాబోయేవాడు. తల్లి పోయినప్పటినుండి భార్యచేత్తో తినక తప్పిందికాదు.

సాయంత్రం సుమారు అయిదుగంటలవుతుంది ప్రభ తన దినచరిత్రను తలపోసుకుంటూ అశ్రుకణాలను రాలుస్తూ కూర్చుంది. ఆమె నూరడించేవారెవరు? మోహనుడు వచ్చాడు. బూటుతీసి దుస్తులు మార్చి, కాళ్లు కడుక్కోటానికి కుళాయిదగ్గిరకు వెళ్లాడు. అక్కడ చల్లదనానికి పడుకున్న పామును అతడు చూడక కాలేశాడు. పాము కాలుకు చుట్టేసింది. ఒక్కవిదిలింపు విదిలించి, పాముపామని కేకలేస్తూ ఒక్క అంగలో సావిట్లోపడ్డాడు. కాటుపడలేదని కసికొద్ది పాము చరచరా మోహనునిదగ్గిర కొచ్చేస్తోంది. యిదంతా ప్రభ చూసింది. ‘నా స్వామిని అపహరిస్తావా?’ అంటూ వెర్రిదానివలె పరుగెత్తి పడగపై మోదింది. అరచేతిలో కాటేసింది. మోహనుడు నిశ్చేష్టుడయాడు. అతని జ్ఞాననేత్రం విడింది. అవ్యాజానురాగం పొంగిపొర్లింది. ఆమె దేవతామూర్తిలా కనబడింది. తానంత దుర్మార్గుడై ఆమెను కష్టపెట్టినా తన కపాయం శంకించి ఎంత త్యాగం చేసింది? భారతసతుల హృదయం అతనికిప్పుడు బోధపడింది. ఆమె పాముకు అడ్డువచ్చి తనవంతు బాధ ఆమె అనుభవించకపోతే తనేస్థితిలో వుండేవాడో! ఇంక ఒక్కక్షణం కూర్చోలేకపోయాడు. చేతులు చాచి, ప్రభా అంటూ పరుగెత్తాడు. ప్రభకు పిలుపు అమృతమైంది. బాధే మరచిపోయింది. తనకోసం మోహనుడు ఆత్రతచెందటం నమ్మలేకపోయింది. ఎదురుగావస్తున్న భర్త చేతుల్లోకి వాలిపోయింది.

‘ప్రభా! దుర్మార్గుణ్ణి క్షమించు. బాహ్యరూపం కోరానుగాని; నీహృదయ సౌందర్యం తెలుసుకోలేకపోయాను.

‘నాథా! మిమ్మల్ని క్షమించటానికి నేనెంతదాన్ని? నేడు నా నోములు ఫలించాయి. మీ అనురాగానికి పాత్రురాలనయ్యాను.’

'ప్రభా! యింత సాహసం చెయ్యవచ్చునా? చెయ్యేదీ? బాధగావుందా?'

'సాహసమేముంది? నావిధి నేను నిర్వర్తించాను. హైందవసతికి భర్త ప్రత్యక్షదైవము. పతిసేవయే సతికి పరమావధి. నా స్వామిని బాధపెడుతోంటే ఎల్లా వూరుకోగలను? మీ ప్రేమామృతము చవిచూడ గల్గినాను. నాకింకేమీ బాధలేదు. నేనిన్నాళ్ళనుండి దేనికై పరితపిస్తున్నానో అది నాకు లభ్యమైంది. ఇంతకన్న నే కోరతగిందేమీలేదు.'

'ప్రభా! నా అవివేకాన్ని మన్నించు. మాణిక్యాన్ని గాజురాయిగా తలచాను. పూర్వచరిత్ర మరచిపో. నూతన జీవిత మారంభిద్దాము' అని ప్రభావతిని అక్కున జేర్చుకున్నాడు. నాటినుండి ప్రభావతీ మోహనులు నిర్మల ప్రేమమూర్తులై జీవయాత్ర గడుపుచున్నారు.

మాతృబోధ

శా॥ ఔరా! యొంతటి మోసగాడవోకో యీయాన్నత్య మేరీతిగా
నే రాజ్యంబుల నేలగంటివోకో, నన్నీరీతి నాడంగ నీ
నోరాడెన్, దలపోయ వించుకయు, నన్నూరార్ప, ఛీ, నీవు నా
గారాపున్ దనయుండవే? కుటిలుడా కాంక్షింతువే దుర్గతిన్.

మ॥ జననీగర్భ విదారకుండవయి, నీచంబంచు లోనెంచకన్
జనముల్ మెచ్చెదరంచు, నీ జన్మంబు వమ్మౌగతిన్
ఘనతాపంబున మునగజేసితివి నా కన్నీరు గాన్పించదో
విను నీశాత్రవమర్దనోద్యమమున్ నీవిప్పట్టునన్ బట్టుమీ!

ఉ॥ నీదగు దేశమాతృపద నీరజమందలి రేకు లన్నియున్
మేదిని గూలిపోవనిక మేల్కొనవిటు నిద్రపోయెదే
యేదరియున్ గనంబడని యీ సమయంబున నిట్టులేయుచో
సోదరులున్ క్షుదార్తులు, కృశోదరులున్ మననిత్తురే నిన్నున్.

గూడూరు సీతారత్నం.